
సాక్షి అనంతపురం

ఆదివారం। 26। మార్చి। 2023



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.




టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.

గరిష్టం/కనిష్టం

40.2°/ 21.5°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



సాధికారతకు ఆసరా

- వరుసగా మూడో ఏడాదీ 'వైఎస్సార్ ఆసరా'
- అక్కచెల్లెమ్మలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- రూ.233.66 కోట్ల మెగా చెక్కు పంపిణీ

అనంతపురం: మహిళా సాధికారతతోనే దేశ పురోగతి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు బ్యాంకుల్లో ఉన్న రుణాలను నాలుగు వాయిదాల్లో తాము నేరుగా చెల్లిస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో సీఎం వైఎస్ జగన్ 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద రెండు విడతలు నగదు జమను దిగ్విజయంగా పూర్తి చేశారు. శనివారం మూడో విడత నగదు జమ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా దెందులూరు బహిరంగ సభ నుంచి సీఎం కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద జిల్లాలో 31,229 స్వయం సహాయక సంఘాల్లోని 3,07,485 మంది అక్కచెల్లెమ్మలకు మంజూరైన రూ.233.66 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతోందన్నారు. డ్వాక్రా రుణాల కంతులు కట్టొద్దని, తామే ఆ మొత్తం కడతామని 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చి.. ఎగ్గొట్టారన్నారు. దీంతో రుణ కంతులు చెల్లించక డీఫాల్టర్లుగా మారిన అక్కచెల్లెమ్మల ఇబ్బందులను పాదయాత్రలో వైఎస్ జగన్ గుర్తించారన్నారు. 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో అక్కచెల్లెమ్మల పేరిట ఉన్న రుణాలను తాము అధికారంలోకి వస్తే నాలుగు వాయిదాల్లో తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి.. నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. వారి సుస్థిరమైన ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 24,098 పొదుపు సంఘాలకు రూ.183.56 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 7,131 పొదుపు సంఘాలకు రూ.53.10 కోట్లు మంజూరైందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు

ఆర్థిక స్వేచ్ఛ కలిగింది



నేను నవ్య స్వయం సహాయక సంఘంలో ఉన్నాను. మా సంఘానికి మూడో విడత వైఎస్సార్ ఆసరాలో రూ.3.16 లక్షల రుణ మాఫీ జరిగింది. మా సంఘంలోని సభ్యులు రూ.30 వేలు చొప్పున లబ్ధి పొందారు. ఆసరా పథకంతో మాకు ఆర్థిక స్వేచ్ఛ కలిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఉంటాం.
– వేదవతి, అనంతపురం

అండగా నిలిచారు



సీఎం జగన్ సొంత తోబుట్టువులుగా మాకు అండగా నిలుస్తున్నారు. చెప్పిన మాట ప్రకారం ఇప్పటికే మూడు దఫాలుగా రుణాల మొత్తాన్ని పొదుపు సంఘాల ఖాతాలో జమ చేశారు. మొత్తం రూ.69,418 జమయ్యింది.
– జ్యోతి, అనంతపురం

విశ్వసనీయతకు జగన్ మారుపేరు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలను ఆచరణలో పెట్టి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారు. పొదుపు సంఘాల ఖాతాల్లోకే నగదు జమ చేసే సంచలనాత్మక కార్యక్రమం ఇప్పటి దాకా దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. మా సంఘానికి ఇప్పటి దాకా రూ.2,15,000 రుణ మొత్తం జమయ్యింది.
– రమాదేవి, అనంతపురం

న్యూస్‌రీల్

మొదలైన వేసవితాపం

- 40 డిగ్రీల మార్కును చేరుకున్న సూరీడు



అనంతపురం అగ్రికల్చర్: మండు వేసవి మొదలైంది. సీజన్‌లో తొలిసారిగా పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల మార్కును అధిగమించింది. ఇంతవరకు 37 నుంచి 39 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు శనివారం యల్లనూరులో 40.2 డిగ్రీలు నమోదైంది. గుంతకల్లు 40.1 డిగ్రీలు, కూడేరు 40, గుత్తి 39.8, పెద్దవడుగూరు 39.6, పుట్లూరు 39.5, శింగనమల 39.4 డిగ్రీలు... ఇలా చాలా మండలాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. అటు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కుకు చేరువైంది. శనివారం తనకల్లులో 39.5 డిగ్రీల గరిష్టం నమోదైంది. మిగతా మండలాల్లో గరిష్టంగా 36 నుంచి 39 డిగ్రీలు, కనిష్టం 21 నుంచి 24 డిగ్రీల మధ్య కొనసాగాయి. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జిల్లా అంతటా వేసవితాపం మొదలైంది. పగలు, రాత్రి ఉక్కపోత తీవ్రత పెరిగింది. సమీప భవిష్యత్తులో 42 నుంచి 44 డిగ్రీలతో భానుడు భగ్గుమనే పరిస్థితి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వేసవితాపం నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఫార్మా ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరి, మార్చి – 2023లో నిర్వహించిన బీ ఫార్మసీ మొదటి సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) , (ఆర్–19), రెండో సెమిస్టర్ (ఆర్–15), (ఆర్–19) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా డీ మొదటి సంవత్సరం (ఆర్–14) సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ మూడో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్ చూడాలని తెలిపారు.

ఇన్‌స్పైర్‌లో జాతీయస్థాయికి ఎంపిక



ఫిర్దోస్ తయారుచేసిన వరిమడిలో కలుపు తీసే యంత్రం

రాప్తాడురూరల్: కణేకల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి అవార్డుల పోటీలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి పాల్గొన్న ప్రాజెక్టులలో 35 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఇందులో కణేకల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని కె.ఫిర్దోస్ తయారు చేసిన 'వరిమడిలో కలుపు తీసేయంత్రం' నమూనా ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో ఈ ప్రాజెక్టు పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. డీఈఓతో పాటు జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావును, గైడ్ టీచర్ బి.లక్ష్మీనారాయణమ్మను అభినందించారు.

జోగిని వ్యవస్థను రూపుమాపాలి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేష సాయి

రాయదుర్గం: జోగినీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. జోగిని/బసివిని/ మాతంగి వ్యవస్థను రూపుమాపేందుకు అనంతపురం జిల్లాలో ఎస్పీ ఫక్కీరప్ప, అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేష సాయి, జస్టిస్ దొనాడి రమేష్, జస్టిస్ శ్యామ్‌సుందర్, ఏపీ లీగల్‌సెల్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం.బబిత, జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ బృందం ఎస్పీ ఫక్కీరప్ప, జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి శనివారం రాయదుర్గంలో పర్యటించింది. స్థానిక జడ్జి ఎస్.లావణ్య, డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉడేగోళం మద్దానేశ్వర కల్యాణమండపం వద్ద ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెప్మా, డ్వాక్రా సభ్యుల వద్ద జీన్స్ ప్యాంట్లను కొనుగోలు చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు వద్దకు చేరుకోగానే, గిరిజన చిన్నారులు నృత్యాలతో అలరించారు. వారిని జడ్జీల బృందం సత్కరించి, బహుమతులు అందజేశారు. జస్టిస్ ఆకుల వెంకటశేష సాయి మాట్లాడుతూ మహిళల రక్షణ, సాధికారత వంటి అంశాల్లో మరింత పురోగతి అవసరముందన్నారు. మంచి, చెడు, కష్టం, బాధ్యతల గురించి తెలిపే ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైపోవడం బాధాకరమన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపులు నేటికీ కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ దొనాడి రమేష్ మాట్లాడుతూ బాలికలకు మంచి, చెడు స్పర్శలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చెడు స్పర్శ ఏ స్థాయిలో జరిగినా తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడమంటే వారి హక్కులు కాలరాయడమేనన్నారు. ఆడపిల్లంటే బరువుగా భావించకుండా బాధ్యతగా పెంచాలన్నారు. అనంతరం ఎస్పీ ఫక్కీరప్ప మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కడా లేనంతగా అనంత జిల్లాలో జోగిని, మాతంగి, బసివిని, యల్లమ్మ లాంటి దురాచార కట్టుబాట్లను రూపుమాపేలా ప్రత్యేక కార్యచరణ చేపట్టామని జడ్జీలకు వివరించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, ఆర్డీటీ సంస్థ సహకారంతో 154 మందికి రూ.3.31 కోట్లతో ఇళ్ల నిర్మాణాలకు కృషి చేశామని గుర్తుచేశారు. తాజాగా మరో 39 మంది పేదలకు రూ.1.20 కోట్లతో శాశ్వత ఇళ్లనిర్మాణాలకు మెగా చెక్కును మీ ద్వారా అందజేశారని వివరించారు. ఈ వ్యవస్థ రూపుమాపేలా జడ్జీల సేవలు అవసరమని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎస్పీలు బి.శ్రీనివాసులు, కత్తి శ్రీనివాసులు, సీఐ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవితో పాటు వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, జోగినీలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మహిళలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జోగినికి ఇంటి పట్టాను అందజేస్తున్న న్యాయమూర్తులు

ఈ–క్రాప్‌లో అవకతవకలు

- అనర్హులకు పంటల బీమా వర్తింపు
- అర్హులకు విస్తీర్ణం తగ్గించి అన్యాయం
- వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఎస్‌లు, వీఆర్‌ఏలే బాధ్యులు
- శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేసిన వ్యవసాయ శాఖ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్– 2021 ఈ క్రాప్ – నమోదులో అవకతవకలు జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం మంజూరులో ప్రభుత్వానికి నష్టం కలిగించే పొరపాట్లకు తావిచ్చిన ఆర్‌బీకే అసిస్టెంట్లు, వీఆర్వోలపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నాయి. ఖరీఫ్–2021కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 2022 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 4 లక్షల మంది రైతులకు రూ.855.55 కోట్ల మేర పరిహారం విడుదలైంది. అయితే బీమా మంజూరులో అన్యాయం జరిగినట్లు కొందరు రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ–క్రాప్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

భూమి లేకున్నా బీమా

భూమి లేకున్నా.. పంటలు సాగు చేయకున్నా కొందరు రైతులకు ఉచిత పంటల బీమా పథకం కింద పరిహారం వచ్చిందని గుర్తించారు. మరికొందరు రైతులు ఒక ఎకరాలో పంట సాగు చేస్తే.. రెండు మూడు ఎకరాలు చూపించి ఎక్కువ మొత్తంలో పరిహారం తీసుకున్నట్లు వెల్లడైంది. మరికొన్ని చోట్ల ఒక పంట బదులు మరొక పంటను ఈ–క్రాప్‌లోకి చేర్చడంతో పరిహారం తారుమారైనట్లు గుర్తించారు. ఉదాహరణకు మిరప వేసిన ప్రాంతాల్లో వేరుశనగ నమోదు చేయడంతో రైతులకు నష్టం వాటిల్లింది. వేరుశనగ స్థానంలో మిరప నమోదు చేయడంతో ప్రభుత్వానికి గండిపడినట్లు వెల్లడైంది. ఇలాంటి తప్పిదాలకు పాల్పడిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (వీఏఏలు), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు (వీహెచ్‌ఏలు), విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు (వీఎస్‌ఏలు)తో పాటు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు (వీఆర్వోలు)ను బాధ్యులను చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉరవకొండ, మడకశిర, శింగనమల, రాప్తాడు, పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, తాడిపత్రి నియోజక వర్గాల పరిధిలో 70 మంది రైతులకు భూమి లేకున్నా, పంట వేయకున్నా పరిహారం వచ్చినట్లు గుర్తించారు. మరో 13 మంది రైతుల విస్తీర్ణం బాగా పెంచి చూపించినట్లు గుర్తించి... బాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసినట్లు తెలుస్తోంది.



ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీఎస్‌ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం, గుంతకల్లులో స్కిల్ హబ్‌ల్లో ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ అండ్ శానిటేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.గోవింద రాజులు ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు లేదా ఫెయిలైన వారు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు ఉన్న యువకులకు ఉచిత శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 990862306, 9032345188 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

28న జాబ్ మేళా

అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి (ఏపీ ఎస్ఎస్‌డీసీ), సీడాప్, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డీమార్ట్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ కాపిటల్, సియాన్ ఈ–హెచ్‌డబ్ల్యూ సమ్మిట్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలతో మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు www.apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8317520929, 08554–280936 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రశ్నపత్రంపై ప్రత్యేక నిఘా

- లీక్ చేస్తే దొరికిపోతారు..
- అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఫర్నీచరు ఉండాలి
- ఆర్జేడీ, ఉమ్మడి జిల్లా పరీక్షల పరిశీలకుడు ప్రతాప్‌రెడ్డి

రాప్తాడురూరల్: ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎవరైనా ప్రశ్నపత్రాలు లీక్ చేస్తే.. దొరికిపోయేలా టెక్నాలజీ రూపొందించామని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా పరీక్షల పరిశీలకుడు బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాల డీఈఓలు, డీవైఈఓలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్లు, ఎంఈఓలు, సీఎస్, డీఓలతో వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ప్రత్యేక నిఘాతో గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక వేళ పేపర్ లీక్ అయితే అది ఏ విద్యార్థిది, ఏ సెంటర్ నుంచి లీక్ అయిందో నిమిషంలో తెలుసుకునేలా టెక్నాలజీని ఉపయోగిస్తున్నామన్నారు. అలాంటి పనులు ఎవ్వరూ చేయకూడదన్నారు. ఏ ఒక్క విద్యార్థీ నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ ఫర్నీచరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపించాలన్నారు. ప్రతి సెంటర్‌లోనూ ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మాయిలను మహిళా టీచర్లు మాత్రమే తనిఖీ చేయాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి మంచి వాతావరణం కల్పించాలని సూచించారు. సీఎస్, డీఓల్లో గతంలో పనిచేసిన వారు ఒక్కరైనా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 29లోపు అన్ని వసతులూ కల్పించాలని ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్లో పరీక్షా కేంద్రం ఉంటే పరీక్షలు జరిగేటప్పుడు ఆ స్కూల్ సిబ్బందిని లోపలికి అనుమతించకూడదన్నారు. సమావేశంలో డీఈఓలు ఎం.సాయిరామ్, మీనాక్షి, ప్రభుత్వ పరీక్షల ఏసీ గోవిందునాయక్ పాల్గొన్నారు.



వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

క్లుప్తంగా

నకిలీ బంగారు నాణేలతో బురిడీ

పెద్దవడుగూరు: మేలిమి బంగారం పేరుతో నకిలీ నాణేలను మహిళకు అంటగట్టి రూ. 2 లక్షలు అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. ఘటనపై పెద్దవడుగూరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రాజశేఖర రెడ్డి తెలిపిన మేరకు... సికింద్రాబాద్‌కు చెందిన విష్ణుదీపిక నైనీ అలియాస్ గాయత్రికి రెండు నెలల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడాడు. తిరుపతికి వచ్చినప్పుడు తనకు నంబర్ ఇచ్చారని గుర్తు చేస్తూ నమ్మకం కలిగించాడు. అనంతరం తన వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, తక్కువ ధరకే ఇస్తానని చెప్పడంతో ఆమె విశ్వసించింది. దీంతో ఈ నెల 7న హొస్పేటకు వచ్చిన ఆమెను ఆగంతకుడు కలసి రెండు బంగారు నాణేలు ఇచ్చి కొంత డబ్బు తీసుకున్నాడు. వాటిని పరిశీలించుకుని మేలిమి బంగారమేనని నిర్ధారించుకున్న తర్వాతనే మిగులు బంగారం కొనుగోలు చేయాలని, తన వద్ద ఇంకా రెండు కిలోల బరువు మేర నాణేలు ఉన్నట్లు నమ్మబలికాడు. రెండు వారాల అనంతరం ఆమె సెల్‌ఫోన్‌కు కాల్ చేసిన ఆగంతకుడు మిగులు బంగారు నాణేల కొనుగోలు విషయం మాట్లాడాడు. అప్పటికే తాను పరీక్షించుకున్న నాణేలు మేలిమి బంగారం కావడంతో ఆమె పూర్తిగా వారి మాయలో చిక్కుకుంది. మిగిలిన నాణేలను సైతం కొనుగోలు చేస్తానని రూ.2లక్షలకు బేరం కుదుర్చుకుంది. అనంతరం ఆగంతకుడు తెలిపినట్లుగా శనివారం ఉదయం గుత్తి సమీపంలోని గేట్స్ కళాశాల వద్దకు తన కుమారుడితో కలసి చేరుకుంది. అప్పటికే అక్కడ వేచి ఉన్న దుండగులు ఆమెతో మాటలు కలిపి రూ.2 లక్షలు తీసుకుని బంగారు నాణేలను అప్పగిస్తూ... తమపై పోలీసుల నిఘా ఉందని, అక్కడే ఉంటే ప్రమాదమంటూ హడావుడి చేస్తూ వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత తన వద్ద ఉన్న నాణేలను పరిశీలించుకున్న ఆమె అవి నకిలీ బంగారంగా గుర్తించి, వెంటనే పెద్దవడుగూరుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

974 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 974 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,866 మందికి గాను 28,064 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,705 మందికి గాను 2,533 మంది పరీక్షలు రాశారు.

ఆర్టీసీలో డీజిల్ దొంగలకు చెక్

- రిటైల్ కొనుగోళ్ల నిలుపుదల
- కంపెనీల నుంచి హోల్‌సేల్‌గా కొనాలని ప్రభుత్వ తాజా నిర్ణయం
- మూడు కంపెనీలకు సరఫరా బాధ్యతలు



అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీలో డీజిల్ అక్రమాలకు చెక్ పెడుతూ జగన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ రిటైల్‌గా కొనుగోలు చేస్తున్న విధానాన్ని నిలిపి వేస్తూ హోల్‌సేల్‌గా కంపెనీల నుంచే నేరుగా తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కొంతకాలంగా ఆర్టీసీలో డీజిల్ సరఫరాలో చోటు చేసుకుంటున్న అక్రమాలకు ఫుల్‌స్టాప్ పడినట్లయ్యింది.

రోజుకు 29,468 లీటర్ల డీజిల్ వినియోగం

ప్రజా రవాణా వ్యవస్థలో ఏపీఎస్ ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో దాదాపు 393 బస్సులు నడుస్తున్నాయి. వీటికి రోజుకు సగటున 29,468 లీటర్ల డీజిల్ ఖర్చవుతోంది. ఈ క్రమంలో ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు బస్సుల మైలేజీపైనే అధికారులు దృష్టిసారించారు. ఇందులో భాగంగా గతంలో పనిచేసిన అధికారులు హోల్‌సేల్ కన్నా రిటైల్‌గా తక్కువకే డీజిల్ దొరుకుతుందనే ఉద్దేశంతో ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. స్థానిక డీలర్ల నుంచే ఇంత కాలం డీజిల్ కొనుగోలు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో అక్రమాలకు పలువురు అధికారులు తావిస్తూ వచ్చారు.

ప్రభుత్వం కళ్లు గప్పి

డీజిల్‌ను రిటైల్‌గా కొనుగోలు చేసే అంశం కొందరు అధికారులకు కాసుల వర్షమే కురిపించింది. నిబంధన మేరకు స్థానిక డీలర్ల నుంచి కాకుండా ధర తక్కువగా ఉన్న కర్ణాటకలో కొనుగోలు చేసి, స్థానిక అధిక ధరను కోట్ చేసి సొమ్ము చేసుకునే వారు. ఈ అక్రమాలు ఇటీవల వాణిజ్య పన్నుల శాఖ అధికారుల తనిఖీల్లో బట్టబయలయ్యాయి. దీని వల్ల డీజిల్ క్రయవిక్రయాల్లో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన జీఎస్టీ నిధులకు గండికొట్టినట్లైంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం డిపోలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్), అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం డిపోలకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), తాడిపత్రికి హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) లిమిటెడ్ నుంచి డీజిల్ సరఫరాకు టెండర్లు ఖరారయ్యాయి.

జిల్లాలో డిపోల వారీగా డీజిల్ వినియోగం

డిపో	బస్సులు	రోజుకు ఖర్చయ్యే డీజిల్
అనంతపురం	89	7,069
గుత్తి	23	1,650
గుంతకల్లు	45	3,681
కళ్యాణదుర్గం	59	4,525
రాయదుర్గం	57	4,457
తాడిపత్రి	71	4,907
ఉరవకొండ	49	3,179

ప్రభుత్వ నిర్ణయం మేరకే

ఏపీఎస్ ఆర్టీసీలో డీజిల్ వినియోగమనేది చాలా కీలకం. గతంలో సంస్థకు ఆదాయం తీసుకురావాలనే ఉద్దేశంతో రిటైల్‌గా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు రిటైల్‌గానే కొనుగోలు చేశాం. తాజాగా ఆయా కంపెనీల నుంచి డిపోలకు నేరుగా సరఫరా చేసేలా టెండర్లు ఖరారు చేశారు. త్వరలో హోల్‌సేల్ ధరతో డీజిల్ సరఫరా కానుంది.

– సుమంత్.ఆర్.ఆదోని, ఆర్ఎం, ఏపీఎస్ ఆర్టీసీ

కార్పొరేట్ కన్నా ప్రభుత్వ బడుల్లోనే బోధన మేలు..

- పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్



న్యాయమూర్తి రమేష్‌ను సన్మానిస్తున్న బాల్యస్నేహితులు

రాయదుర్గం: కార్పొరేట్ కన్నా ప్రభుత్వ బడుల్లోనే విద్యాబోధన మెరుగ్గా ఉంటుందని, ఆత్మస్థైర్యంతో విద్యాభ్యాసం కొనసాగించిన వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడం కష్టమేమీ కాదని ఏపీ హైకోర్టు, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి డి.రమేష్ అన్నారు. శనివారం రాత్రి రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977–79 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థిగా హాజరైన న్యాయమూర్తి రమేష్ మాట్లాడుతూ.. ఉద్యోగరీత్యా తన తండ్రి రాయదుర్గానికి రావడంతో తన ప్రాథమిక విద్య ఇక్కడే మొదలైందని గుర్తు చేశారు. ఆదివారం వచ్చిందంటే స్నేహితులతో కలసి సైకిళ్ల పై మద్దానేశ్వర ఆలయం వద్దకెళ్లి ఆడుకునేవారమన్నారు. లక్ష్మీబజార్‌లో నివాసమున్న ఇంటిని గుర్తుచేసుకున్నారు. పాఠశాలను చూస్తుంటే తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలను సందర్శిస్తానంటే నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఇలా ఏకతాటిపైకి తెచ్చిన స్థానిక న్యాయమూర్తి లావణ్యను అభినందించారు. 9వ తరగతి తర్వాత నాన్న తిరుపతికి బదిలీ కావడంతో అక్కడ ఓ కార్పొరేట్ పాఠశాలలో 10వ తరగతిలో చేరాల్సి వచ్చిందని, ఇష్టపడి చదవడానికి, కష్టపడి చదవడానికి మధ్య తేడా అప్పుడే గుర్తించానన్నారు. అనంతరం న్యాయమూర్తి రమేష్‌ను బాల్యమిత్రులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాయదుర్గం, కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జీలు ఎస్.లావణ్య, బి.సుబహన్, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులు, డీఈఓ సాయిరామ్, తహసీల్దార్ మారుతి, సీఐ యుగంధర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృశాఖకు జీసీడీఓ రెబాకా

రాప్తాడురూరల్: కేజీబీవీల నిర్వహణలో తీవ్ర అలసత్వం ప్రదర్శించిన సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) రెబాకాను విధుల నుంచి తప్పించారు. మాతృశాఖకు రీప్యాట్రియేషన్ చేస్తూ శనివారం రాత్రి కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జీసీడీఓ పోస్టుకు హెచ్ఎం అర్హులు. అయితే స్కూల్ అసిస్టెంట్ అయిన రెబాకా ఈ పోస్టులోకి వచ్చారు. వచ్చినప్పటి నుంచి విధుల పట్ల నిర్లక్ష్యం, కేజీబీవీల పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈమె వ్యవహారంపై గతంలో డీపీఓగా పని చేసిన అధికారి నివేదిక ఇచ్చారు. తాజాగా ఓ కేజీబీవీలో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో జీసీడీఓపై వేటు పడింది. జీసీడీఓను మాతృశాఖకు పంపుతూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని సమగ్రశిక్ష డీపీఓ సాయిరామ్ తెలిపారు.

ఆర్థిక పటిష్టతకు చర్యలు తీసుకోండి



మహాజనసభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఆర్థిక పటిష్టతకు చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా రూ.71 కోట్ల మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీసీబీ ఉద్యోగులను ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. శనివారం స్థానిక డీసీసీబీ హాలులో బ్యాంక్ సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన డీసీసీబీ 124వ మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ... 6.72 శాతం ఉన్న మొండిబకాయిల వసూళ్లకు సరైన కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతులు, ఇతర అన్ని వర్గాలకు మరింత నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు, రుణాలు అందించేందుకు వీలుగా వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించాలన్నారు. డిపాజిట్లుపై అందజేస్తున్న వడ్డీరేట్లపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. వివిధ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన భాగస్వామ్యాన్ని సద్వినియోగం చేసుకుంటే సహకార బ్యాంకులు, సొసైటీలు ఆర్థిక పరిపుష్టి సాధించడం ఖాయమన్నారు. ఇటీవల సహకార చట్టంలో సవరణలు చేశారని, అందులో ఆర్‌బీకేలను సొసైటీలతో అనుసంధానం చేయడం, సొసైటీల్లో ఇక నుంచి రెండు ఆడిట్లు నిర్వహించడం, సంఘాలతో విచారణ చేపట్టాలంటే ఫైనాన్షియల్ బ్యాంక్ ఆమోదం తీసుకోవడం, సహకార సంఘాల్లో ఏ సభ్యుడైతే వ్యాపారం చేస్తారో వారికే ఓటు హక్కు కల్పించడం, బ్యాంకు సీఈవోల నియామకానికి స్టేట్ లెవెల్ ప్యానెల్ ఏర్పాటు, కామన్ సర్వీసు సెంటర్ల ఏర్పాటు ద్వారా బస్సు, రైలు, విమానం టికెట్ల సదుపాయం కల్పించడం, ప్రతిసంఘం కంప్యూటరీకరణ చేపట్టి క్యూఆర్ కోడ్ కల్పించడం లాంటి సవరణల గురించి అధ్యయనం చేయాలన్నారు. పాలకవర్గం, అధికార యంత్రాంగం కలిసికట్టుగా పనిచేసి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించాలని పిలుపునిచ్చారు. మహాజన సభలో రెండు జిల్లాల డీసీఓలు ఎం.ప్రభాకరరెడ్డి, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ, డైరెక్టర్లు శంకరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామాంజినేయులు, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, అబ్దుల్‌రషీద్, బ్యాంకు జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవి కుమార్, పి.యాలేరు సొసైటీ అధ్యక్షుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న ఉద్యోగ మేళా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 28న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ వేదికగా ఎస్ఐబీటీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్హత, 20 నుంచి 25 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులు. ఎంపికైన వారికి 30 రోజుల శిక్షణ అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ఐసీఐసీఐ బ్యాంక్ శాఖల్లో రిలేషన్‌షిప్ మేనేజర్లుగా ఉద్యోగాలను కలిస్తారు. వీరికి నెలకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకూ జీతం అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలి. మరింత సమాచారానికి 78426 48484లో సంప్రదించవచ్చు.

పెళ్లి కాలేదన్న దిగులుతో యువకుడి ఆత్మహత్య



మృతుడు చలపతి

పెద్దపప్పూరు: పెళ్లి కాలేదన్న దిగాలుతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిసిన మేరకు... పెద్ద పప్పూరు మండలం చిన్న యక్కలూరు గ్రామానికి చెందిన చలపతి (25) తల్లితో కలసి జీవిస్తున్నాడు. పోలియో కారణంగా ఓ చెయ్యి పనిచేయకుండా పోయింది. చిన్నాచితక పనులతో కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఇటీవల చలపతికి పెళ్లి చేయాలని కుటుంబసభ్యులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే వైకల్యం కారణంగా పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీనికి తోడు ఇటీవల అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఇక తనకు పెళ్లి కాదంటూ బంధువులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే తీవ్ర ఆత్మనూన్యతకు లోనై శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఖాజాహుస్సేన్ అక్కడకు చేరుకుని చలపతి మృతిపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మైనారిటీ సంక్షేమశాఖ జిల్లాధికారి సర్వీసు కొనసాగింపు

అనంతపురం రూరల్: మైనారిటీ సంక్షేమశాఖ జిల్లాధికారిగా మహమ్మద్ రఫీను కొనసాగిస్తూ శనివారం ఆ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన హోదాను 2024, జనవరి 12వ తేదీ వరకూ పొడిగిస్తూ జీఓ నంబర్ 80ను విడుదల చేశారు.

డిగ్రీ విద్యార్థి కిడ్నాప్

- గంటలోపే ఛేదించిన పోలీసులు

రాప్తాడు రూరల్: డిగ్రీ విద్యార్థి కిడ్నాప్ ఘటన శనివారం అనంతపురం నగరంలో కలకలం రేపింది. సమాచారం అందుకున్న గంటలోపే కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ విజయభాస్కర్ గౌడ్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పోలేపల్లికి చెందిన తేజ.. అనంతపురంలోని నలంద కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలంగా రాప్తాడు మండలానికి చెందిన ఓ మైనర్ బాలిక (ఇంటర్ ద్వితీయ సంవత్సరం)తో ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తరపు బంధువులు పలుమార్లు తేజను హెచ్చరించారు. అయినా అతనిలో మార్పు రాలేదు. శనివారం అనంతపురం శివారులోని శ్రీవాణి డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు తేజ వెళ్లాడు. అదే సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన బాలిక సమీప బంధువును తేజ రెచ్చగొట్టేలా మాట్లాడాడు. దీంతో ఆ విద్యార్థి వెంటనే ఫోన్ చేసి విషయాన్ని తన తండ్రికి తెలిపాడు. పరీక్ష ముగిసే సమయానికి బాలిక బంధువులు నలుగురు ద్విచక్ర వాహనాల్లో అక్కడకు చేరుకుని తేజను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని వెళ్లిపోయారు. ప్రత్యక్ష సాక్షులు డయల్ 100కు సమాచారం అందించడంతో హైఅలర్ట్ యాప్ ద్వారా కిడ్నాపర్ల కదలికలను అనంతపురం రూరల్ పోలీసులు పసిగట్టి, ఎస్ఎస్ గేటు మీదుగా రామగిరి వైపు వెళ్తున్న వారిని చెన్నేకొత్తపల్లి పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. సీఐ విజయభాస్కర్ గౌడ్ ఆదేశాలతో ఎస్ఐలు నబీరసూల్, వెంకటరమణ, సిబ్బంది చెన్నేకొత్తపల్లికి వెళ్లి కిడ్నాపర్లను అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకొచ్చారు. కిడ్నాప్‌కు పాల్పడిన అమ్మాయి తండ్రి, ఆయన కుమారుడు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

నయవంచకుడు చంద్రబాబు



వైఎస్సార్ ఆసరా వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాట తప్పాడు
- మహిళలను ఆదుకున్న మహానుభావుడు జగన్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయ్య

అనంతపురం సిటీ: డ్వాక్రా మహిళలనూ మోసగించిన నయవంచకుడు చంద్రబాబు అని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాట తప్పి అప్పుల ఊబిలోకి నెట్టేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వరుసగా మూడో ఏడాది కూడా 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద డ్వాక్రా మహిళల ఖాతాలకు నగదు బదిలీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ తరువాత వైఎస్ విగ్రహంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. బీసీ సెల్ రీజనల్ కో–ఆర్డినేటర్ బీసీ రమేశ్ గౌడ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, సీనియర్ నాయకుడు ఎర్రిస్వామిరెడ్డి, ఏడీసీసీ మాజీ చైర్మన్ పామిడి వీరా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బిందెల శ్రీదేవి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేగ్, సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, పార్టీ, అనుబంధ విభాగాలకు చెందిన అన్ని క్యాడర్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పైలా నరసింహయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'డ్వాక్రా రుణాలు కట్టొద్దు. మేం అధికారంలోకి వస్తే మాఫీ చేస్తాం' అన్న టీడీపీ అధినేత చంద్రబాబు మాటలు నమ్మి మహిళలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి మహిళలందరి జీవితాల్లో 'వైఎస్సార్ ఆసరా' ద్వారా వెలుగులు నింపిన మహానుభావుడు సీఎం జగన్ అని కొనియాడారు. అక్కచెల్లెమ్మలకు సుస్థిర ఆదాయం రావాలని, వారు సృష్టించుకునే వ్యాపార, జీవనోపాధి అవకాశాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకోవాలన్నదే జగనన్న సంకల్పమని పేర్కొన్నారు. మరో 30 ఏళ్లు జగనే సీఎంగా ఉండాలని రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి, నాయకులు బలపనూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'స్కిల్' సూత్రధారి చంద్రబాబే : పైలా

అనంతపురం క్రైం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ సూత్రధారి టీడీపీ అధినేత చంద్రబాబేనని, ఈ కుంభకోణంలో ఆయన కటకటాలకెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో అప్పటి సీఎం హోదాలో చంద్రబాబు రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దోచేశాడని ఆరోపించారు. మొత్తం రూ.3,356 కోట్ల విలువైన ఈ ప్రాజెక్ట్‌లో ప్రభుత్వ వాటా పది శాతం కాగా, సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులను భరిస్తున్నట్లుగా నకిలీ ఒప్పందాన్ని సృష్టించారన్నారు. ప్రపంచంలో ఏ ప్రైవేట్ కంపెనీ కూడా 90 శాతం నిధులను కేటాయించదనే ఇంగిత జ్ఞానం కూడా చంద్రబాబుకు లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. పది శాతం నిధుల పేరుతో ఐదు విడతలుగా నిధులు విడుదల చేసి, స్వాహా చేశారన్నారు. ఈ డబ్బు మొత్తం షెల్ ద్వారా హవాలా రూపంలో చంద్రబాబు ఖాతాలో చేరిందన్నారు. ఈ కుంభకోణంపై జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఈడీ, సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తూ ఆధారాలతో సహా నిందితులను అరెస్ట్ చేస్తుంటే.. చంద్రబాబును కాపాడేందుకు టీడీపీ, ఎల్లో మీడియా కక్ష సాధింపు చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

క్లుప్తంగా

జామియా మసీదు ఈఓగా హుస్సేన్‌సాబ్


మాట్లాడుతున్న నదీం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జామియా మసీదు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా రిటైర్డ్ ఇంజినీర్ హుస్సేన్‌సాబ్‌ను నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖదీర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జామియా మసీదు ముతవల్లి సస్పెండ్ అయ్యాడు. ఆయన స్థానంలో ఈఓగా హుసేన్‌సాబ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, మసీదు కమిటీ సభ్యులు అభినందించారు.

రామకృష్ణ విద్యాలయంలో సరస్వతీ పూజ


పాఠశాల యాజమాన్యంతో పదో తరగతి విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం వికాస్‌నగర్‌లోని రామకృష్ణ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. సరస్వతీ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల డైరెక్టర్ టి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులందరికీ సరస్వతీదేవి కటాక్షం ఉండాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.సునీత, టి.అనిత ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసెస్ కమిటీ ఎంపిక

అనంతపురం కల్చరల్: వచ్చేనెల 8న జరగనున్న రన్ ఫర్ జీసెస్ కమిటీని శనివారం సాయంత్రం ఎంపిక చేశారు. స్థానిక అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చి ప్రాంగణంలో వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్‌గా సీఎస్ఐ చర్చి పాస్టర్ బెన్హర్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్, కన్వీనర్లుగా పాస్టర్ ఆడమ్స్, జాన్ వెస్లీలను నూతన కమిటీలోకి తీసుకున్నారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి ర్యాలీ ప్రారంభమై సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ చర్చి వరకు సాగాలని ఈసందర్భంగా తీర్మానించారు. కార్యక్రమంలో వివిధ ప్రార్థనా మందిరాల పాస్టర్లు సంపత్‌కుమార్, ఆనంద్, అనిల్, ఏసుదాసు పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వజ్రకరూరు జెడ్పీటీసీ సభ్యుడు వశికేరి రమేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా అదనపు ఎస్పీ నాగేంద్రుడును కలసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో నారా లోకేష్ సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పాట రూపంలోనూ చిత్రీకరించి దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ప్రజలు, సీఎం అభిమానుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న లోకేష్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీపీ సోషల్ మీడియాపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పటాస్ శ్రీకాంత్, గోవర్ధన్ రాయల్, నవీన్ కుమార్, లోకేష్, బండికాశి నార్పల శంకర్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో మానవ మనుగడ

- ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ సౌమిత్రో బెనర్జీ



మాట్లాడుతున్న డాక్టర్ సౌమిత్రో బెనర్జీ

రాప్తాడు రూరల్: మానవ తప్పిదాల కారణంగా మనిషి మనుగడ ప్రమాదపుటంచులకు చేరుకుందని శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో ఫిజికల్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్ సౌమిత్రో బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఆంధ్రప్రదేశ్ సైన్స్ కాన్ఫరెన్స్ మహాసభలు శనివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో ప్రారంభమయ్యాయి. సదస్సుకు తొలి రోజు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సౌమిత్రో బెనర్జీ మాట్లాడుతూ.. పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్‌హౌస్ గ్యాస్ కారణంగా అతి తక్కువ కాలంలోనే గ్లోబల్ మీన్ ఉష్ణోగ్రత ఒక డిగ్రీ పెరిగిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోవు కొన్ని దశాబ్దాల్లో గ్లేసియర్లు (ఐస్ స్తూపాలు) కరిగి సముద్ర మట్టం పెరుగుతుందన్నారు. ఫలితంగా సముద్రతీరాన ఉన్న నగరాలకు పెను ప్రమాదం ఉంటుందన్నారు. పర్యావరణంలోని మార్పులకు మానవ తప్పిదాలే కారణమన్నారు. ఇప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు మనం తీసుకునే చర్యల మీదనే భవిష్యత్తులో మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కె.తబ్రేజ్ ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఆశలత మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు, కరోనా విపత్కర పరిస్థితుల్లో యాంటీ బయోటిక్స్‌ను విచ్చలవిడిగా వాడకం వల్ల వ్యాధి కారక సూక్ష్మక్రిములు రోగ నిరోధక శక్తిని పెంచుకుని.. ఏ మందుకూ లొంగకుండా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు 'యాంటీ–మైక్రోబియల్ రెసిస్టెన్స్ – శాస్త్ర పరిశోధనకు ఎదురవుతున్న సవాళ్లు – కర్తవ్యాలు' అనే అంశాలపై సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రకృతి పరిరక్షణపైనే మానవ మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. సదస్సులో డాక్టర్.ఆర్.గంగాధర్, ఆనంద్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపద సమయాల్లో అప్రమత్తంగా ఉండండి



రెస్క్యూటీంకు కిట్ అందిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: అగ్ని ప్రమాదాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండి, సేవలందించాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు అనంతపురం శివారులోని టీటీడీసీలో నిర్వహించిన రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు సభ శనివారం నిర్వహించారు. జెడ్పీచైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. ఆపద సమయాల్లో స్వచ్ఛందంగా సేవలందించే వారికి ఇదో చక్కటి అవకాశమన్నారు. అనంతపురం మెమొంటోలు, సర్టిఫికెట్లు, కిట్లు అందించారు.జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఎకరాకు పది బస్తాల దిగుబడి

ఆత్మకూరు: రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట ఎకరాకు పది బస్తాల దిగుబడి వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. శనివారం మండలంలోని పి.యాలేరు వద్ద పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎకరాకు ఎనిమిది నుంచి పది బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకట్ ప్రసాద్, ఏఈఓ సుజిత, విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఫోన్‌లో వేధిస్తున్నాడని ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఫోన్‌లో ఓ వేధిస్తున్నాడని నవోదయ కాలనీకి చెందిన మహిళ వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదుపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మహిళను ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తి ఉరవకొండ నియోజకవర్గంలోని ఆమిదాలకు చెందిన సుబ్బయ్యగా పోలీసులు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి, విచారిస్తున్నారు. అతన్ని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చనున్నట్లు సీఐ తెలిపారు.

జనం కోసం బతికిన జర్నలిస్టు శ్రీనాథ్ రెడ్డి

- ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సంస్మరణ సభలో వక్తలు


శ్రీనాథ్ రెడ్డి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, వైఎస్సార్ సీపీ నాయకులు, జర్నలిస్టులు

అనంతపురం క్రైం: అక్షరమే ఆయుధంగా జనం కోసం బతికిన జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి అని వక్తలు కొనియాడారు. శనివారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ రామచంద్రారెడ్డి (ఆర్‌సీఆర్), ఎడిషన్ ఇన్‌చార్జ్ మహేశ్వర్ రెడ్డి, సెకండ్ ఇన్‌చార్జ్ పెరుమాల్ వెంకట్, టీవీ ఇన్‌చార్జ్ శివారెడ్డి, ఐజేయూ సభ్యులు బడా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, నగరాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి తదితరులు శ్రీనాథ్ రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ఏపీయూడబ్ల్యూజే జిల్లా కో కన్వీనర్ మంజునాథ్ అధ్యక్షత వహించారు.

శ్రీనాథ్‌రెడ్డి ఎందరికో స్ఫూర్తి :
వక్తలు మాట్లాడుతూ రాయలసీమ సంస్కృతి వికాసానికి, సమస్యల పరిష్కారానికి దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిది అని కొనియాడారు. జనం కోసం కలంతో ఆయన చేసిన పోరాటం భావిజర్నలిస్టులకు స్ఫూర్తి అన్నారు. రాయలసీమ జిల్లాల్లో కరువు కరాళ నృత్యం చేస్తుంటే ఆయన కలం కన్నీరుకార్చిందన్నారు. ఆ కన్నీటి సిరా చుక్కలే నాటి ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాయన్నారు. వంద మంది పోలీసులు ఏకమైనా తన కలం ఆగదని నిర్భయంగా చెప్పగలిగిన, సత్తా ఉన్న జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి అని కొనియాడారు. శ్రీనాథ్ రెడ్డిస్ఫూర్తితో ప్రతి జర్నలిస్టు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు రామకృష్ణ, నాగేంద్రరెడ్డి, చిన్న పత్రికల సంఘం డేవిడ్, జాప్ నేత రవి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రమేష్‌కుమార్, జర్నలిస్టులు బాలు, మురళీకృష్ణ, రామలింగారెడ్డి, రాజారెడ్డి, పాముదాయి సతీష్, భానుప్రకాష్, సాయి, కేశవ, హనుమంత్‌రెడ్డి, శ్రీకాంత్, రమణ, పవన్, సుబ్బరాయుడు, ప్రకాష్, చిరంజీవి, రవీంద్ర, రఘురాజ్, సాగర్, మీడియా ఎంప్లాయీస్ రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల ఆర్థిక ప్రగతి


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ ఆసరాతో మహిళాభివృద్ధి సాధ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆసరా మూడో విడత లబ్ధి సందర్భంగా నగరంలోని 68, 72వ సచివాలయల పరిధిలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మహిళలకు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ అనంతపురంలోని 2527 ఎస్‌హెచ్‌జీల్లో 24,531 మంది సభ్యులకు 20.07 కోట్ల ఆసరా మంజూరైందన్నారు. 50వ డివిజన్‌లో కార్పొరేటర్ గురుశేఖర్ బాబు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 32వ డివిజన్‌లో కార్పొరేటర్ కమల్‌భూషణ్ ఆధ్వర్యంలో 46వ సచివాలయంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, సీఓ శిరీష, వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

లేఅవుట్‌లో పెండింగ్ పనులు ప్రారంభించాలి

జగనన్న లే అవుట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రాక్రెట్ ఏజెన్సీ నిర్వాహకులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన డిప్యూటీ కమిషనర్ సావిత్రితో కలసి ఆలమూరు లేఅవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. కురుకుంట లేఅవుట్ ఏ, బీ, సీ, డీ, తాటిచెర్ల, ఉప్పరపల్లి డీలో పనులు ప్రారంభించాలన్నారు.

మహిళల సంక్షేమానికి సీఎం కృషి

ఆత్మకూరు: మహిళల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత డబ్బులు జమ చేశారు. ఏపీఎం మదన్‌మోహన్ మాట్లాడుతూ మండలంలో 679 సంఘాలకుగాను 6,556 మంది సభ్యులు ఉన్నారన్నారు. వారికి రూ.448 కోట్లు నగదు ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా సంఘాల సభ్యులు అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో శనివారం క్షీరాభిషేకం చేశారు. ఇప్పటికి మూడు విడతల్లో రూ. కోటీ 72 లక్షలు మాఫీ చేశారని డ్వాక్రా సంఘాల ప్రతినిధులు తెలిపారు. వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ సచివాలయ కన్వీనర్లు రవీంద్రారెడ్డి, జి.సుధాకర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చలపతి, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

- అదనపు ఎస్పీ హనుమంతు


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అదనపు ఎస్పీ హనుమంతు పిలుపునిచ్చారు. న్యూరో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో మెదడు గాయాలపై నగరంలో శనివారం ర్యాలీ చేశారు. స్థానిక సర్వజనాస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ భాస్కర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ర్యాలీ సప్తగిరి సర్కిల్ మీదుగా కొనసాగింది. సప్తగిరి సర్కిల్‌లో పెద్ద ఎత్తున మానవహారం ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మెదడు గాయాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన టీషర్టులను విద్యార్థులు ధరించి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు ఎస్పీ హనుమంతు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ వైవీ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ రవితేజ, మనోరంజన్‌రెడ్డి, శ్యాంప్రసాద్, మధుసూదన్, డాక్టర్ సౌజన్యకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు, బయోమెడికల్ ఇంజినీర్ సురేష్, 2017 బ్యాచ్ హౌస్ సర్జన్లు, 2020, 2022 బ్యాచ్‌కు చెందిన మెడికల్ విద్యార్థులు, న్యూరో సర్జరీ విభాగం అధ్యాపకేతర సిబ్బంది, డీడీ ఫార్మకంపెనీ అధినేతలు తదితరులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్‌లో ఎస్కేయూ విద్యార్థులు

అనంతపురం: కర్ణాటక రాష్ట్రంలోని గదగ్‌లో జాతీయ సమైక్యతా శిబిరాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఇందులో ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. గదగ్ జిల్లాకు 12 కిలోమీటర్ల దూరంలోని నాగావి, మలసముద్రం, కలసాపురంలోని కొండ మీద ట్రెక్కింగ్ నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చాగంటి రామిరెడ్డి తెలిపారు.

హంతకుడిని కఠినంగా శిక్షించాలి

– ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న మందకృష్ణ, నాయకులు

అనంతపురం అర్బన్: పోలీసుల నిర్లక్ష్యంతోనే బొందలవాడకు చెందిన దళిత యువతి రమాదేవి హత్యకు గురైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ అన్నారు. రమాదేవి హంతకుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సాకే హరి అధ్యక్షతన జరిగిన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మందకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రమాదేవి కనిపించలేదని నార్పల పోలీసు స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రులు ఈనెల 5న ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు విచారణ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. నిందితుడు జాఫర్ గురించి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేబీ సామ్రాట్ మధు, బండారు శంకర్, చిన్న అంజనేయులు, యల్లన్న, ఆనంద్, మృతురాలి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

రాప్తాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్రానికి బిల్లు పంపడంతో రాప్తాడులో శనివారం వాల్మీకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీలిచ్చారే తప్ప ఆ దిశగా చర్యలు చేపట్టింది లేదన్నారు. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో తీర్మానం చేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సాకే జయన్న, నాగరాజు, ముత్యాలన్న, రామాంజనేయులు, ఆంజనేయులు, ఓబులేష్, కేశవ, సురేష్ పాల్గొన్నారు.

ఇద్దరు డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పామిడిలోని ఓ పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడడంతో చర్యలు తీసుకున్నామన్నారు.

గడువులోపు ప్రైవేట్ క్లినిక్‌ల వివరాలు నమోదు చేయండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో ఉన్న ప్రైవేట్ వైద్యశాలలు, నర్సింగ్ హోంలు, పాలీక్లినిక్‌లు, డెంటల్ క్లినిక్‌లు, లాబొరేటరీలు, ఫిజియోథెరపి క్లినిక్‌ల వివరాలను ఏపీ వైద్య, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట పరిధిలో నమోదు చేయాలని నిర్వాహకులకు డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత పోర్టల్‌ను పూర్తిగా ఫ్రీజ్ చేయడం జరుగుతుందని, అనంతరం రెన్యూవల్‌కు అవకాశం ఉండదన్నారు. నమోదు కాని సంస్థలపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న వీసీలు



సదస్సులో పాల్గొన్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన, ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: మేఘాలయాలోని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్‌జోన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి వైస్ చాన్సలర్స్ సదస్సుకు జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింకా రంగజనార్దన, ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. 'ఆత్మనిర్భర్ భారత్ కోసం పరివర్తనాత్మక ఉన్నత విద్య' అంశంపై సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయలోని సెంట్రల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఎస్కేయూ, జేఎన్‌టీయూ (ఏ) వీసీలు చర్చించారు.

బహిరంగ ప్రకటన

[illegible]

షెడ్యూలు

[illegible]

టి. విశ్వనాథ్, అడ్వకేట్, అనంతపురము. మొబైల్ నెం: 9440285641



సంక్షిప్త సమాచారం

రెండురోజులు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం: ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఈ నెల 27, 28వ తేదీల్లో నీటి సరఫరా బంద్ అవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా నడిమివంక వద్ద ఉన్న మెయిన్ పైప్‌లైన్ మార్చాల్సి వస్తోందన్నారు.


ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మెరిసిన విద్యార్థినులు

రాప్తాడు: రాప్తాడు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు గత ఏడాది నిర్వహించిన నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సరిత, ఉషశ్రీ, గృహిత, ధరణి, సహస్ర, శ్రీ చరిష్మా ప్రతిభ కనబరిచారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ ఒక్కో విద్యార్థికి ఏటా రూ. 12 వేల చొప్పున మొత్తం రూ. 48 వేలు కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. పేదరికంలో ఉండి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యా ర్థులను ప్రిన్సిపాల్ పద్మజాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

27న కౌన్సిల్ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సంగం శ్రీనివాసులు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదే రోజున జరగాల్సిన స్పందన కార్యక్రమం రద్దయినట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న క్రాఫ్ట్ బజార్


బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్

అనంతపురం క్రైం: నగరంలోని చంద్ర హాస్పిటల్ ఎదురుగా ఆర్టీసీ బస్టాండ్ మైదానంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. ఉగాది పండుగను పురస్కరించుకొని ఈ ప్రదర్శనలో కలంకారీ శారీస్, వస్త్రాలు, బ్యాంగిల్స్, డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ షర్టులు, జైపూర్ బెడ్‌షీట్స్, పానిపట్ సోఫా కవర్స్, మైసూర్ పెయింటింగ్స్, టెరికోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, 1 గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్స్ ఇలా 50 వేల రకాల వస్తువులు అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన వచ్చే నెల 2వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

